క్లుప్తంగా

కల్లుగీత కార్మికులకు 50 శాతం రాయితీ

● దరఖాస్తుకు నేడు చివరిరోజు



కల్లుగీత కార్మికులకు పాలసీ వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సీఐ సుకన్య

చీమకుర్తి: కల్లుగీత కార్మికులు మద్యం దుకాణాలు పొందితే వారికి ప్రభుత్వం 50 శాతం రాయితీ కల్పించిందని ఎక్సైజ్ సీఐ సుకన్య తెలిపారు. సర్కిల్ పరిధిలోని కల్లుగీత కార్మికులతో మంగళవారం చీమకుర్తిలోని తన కార్యాలయంలో సీఐ సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ వివరాలను వారికి తెలియజేశారు. చీమకుర్తి సర్కిల్ పరిధిలో మొత్తం రెండు మద్యం దుకాణాలు కేటాయించగా వాటిలో ఒకటి సంతనూతలపాడు మండల పరిధిలోని గౌడ కులస్తులకు, రెండోది మద్దిపాడు మండలంలోని గమళ్ల కులస్తులకు కేటాయించినట్లు తెలిపారు. ఆయా సామాజికవర్గాల వారు తమ దరఖాస్తులను సమర్పించేందుకు బుధవారం చివరి రోజు అని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు తమ దరఖాస్తులను 50 శాతం రాయితీతో ఆన్‌లైన్ లేక ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేయటం తెలియని వారికి తమ కార్యాలయంలోనే దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించినట్లు చెప్పారు. సంతనూతలపాడు, మద్దిపాడు మండల పరిధిలోనున్న కల్లుగీత కార్మికులు హాజరయ్యారు.

ఎంపీడీవో సురేష్ బాబుకు సత్కారం



ఎంపీడీవో సురేష్ బాబు ను సత్కరిస్తున్న జెడ్పీటీసీ రమణమ్మ, ప్రజా ప్రతినిధులు

సంతనూతలపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో జిల్లా స్థాయిలో ఉత్తమ ఎంపీడీవోగా అవార్డు అందుకున్న డీ సురేష్ బాబును పలువురు ప్రజాప్రతినిధులు సత్కరించారు. సంతనూతలపాడు జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, ఎంపీపీ బుడంగుంట విజయ, పలువురు మహిళా సర్పంచులు, ఎంపీటీసీలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు మండవ సులోచన, తన్నీరు రాగమ్మ, గుడిపాడు ఎంపీటీసీ టి.సుజాత, సంతనూతలపాడు, చిలకపాడు, మద్దులూరు, తక్కెళ్లపాడు, వేములపాడు సర్పంచ్‌లు దర్శి నాగమణి, బీ కోమలి, ఎం శైలజ, పీ సుజాత, ఈ.విజయలక్ష్మి తదితరులు ఎంపీడీవో సురేష్ బాబును సత్కరించిన వారిలో ఉన్నారు.

డీటీసీ కార్యాలయంలో రక్తదాన శిబిరం

ఒంగోలు సబర్బన్: రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక వెంగముక్కలపాలెం రోడ్డులోని ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పేస్ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్-1, క్విస్, రైజ్ ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయకుమార్, డీటీసీ ఆర్. సుశీల, మేయర్ సుజాత, ఎంవీఐలు ఎ.కిరణ్ ప్రభాకర్, కె.రామచంద్రరావు, ఎల్.సురేంద్ర ప్రసాద్, కె.జయ ప్రకాష్, యు.ధర్మేంద్ర, బి.భాను ప్రకాష్, ఏఓలు డి.సుధాకర్, ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదు చేశామని తప్పుడు కేసు పెడతారా?

ఒంగోలు వన్‌టౌన్: టీడీపీ పాలనలో బాధితులపై తప్పుడు కేసుల సంస్కృతి పెరిగిందని దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రం విమర్శించారు. ఒంగోలులోని ఆయన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఒంగోలు కేశవరాజుకుంటకు చెందిన దళిత బాలికను అదే ప్రాంతానికి చెందిన యువకులు వేధిస్తున్నారని కుటుంబ సభ్యులు తాలుకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదన్నారు. నిందితులైన యువకుల్లో ఒకరి తల్లి మల్లేశ్వరి టీడీపీ నాయకురాలు కావడంతోనే సీఐ అజయ్‌కుమార్ కేసు నమోదు చేయలేదని ఆరోపించారు. డీఎస్పీ విచారించక పోగా, ఎస్సై అనిత, పావని బాధితులను బెదిరించి వీడియో చిత్రీకరించడం, కేసు నమోదు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఒంగోలు వచ్చిన ఐజీ త్రిపాఠికి బాధితులతో కలిసి తాను ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారన్నారు. అదే సమయంలో బాధితుల పక్షాన నిలిచామన్న కోపంతో తనపై, ఇతర దళిత నాయకులపై తప్పుడు కేసులు పెట్టడం తగదన్నారు. ఈ విషయంలో న్యాయ పోరాటం చేస్తామన్నారు.

ఈ-పంట నమోదుతో మేలు

నాగులుప్పలపాడు: రబీలో పంటలు సాగుచేసిన రైతులు ఈ పంటలో వివరాలు నమోదు చేయించుకోవాలని ఏఓ పి.వెంకట్రావు సూచించారు. మండలంలోని మాచవరం, రాపర్ల గ్రామాల్లో పంటలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. శనగ పంటలో ఎర్ర మచ్చ తెగులు, వరిలో అగ్గి తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. వారం రోజుల్లో రైతులకు ప్రత్యేక గుర్తింపు నంబర్ ఇస్తామన్నారు. రైతులకు 50 శాతం రాయితీపై స్ప్రింక్లర్లు అందజేస్తున్నామని చెప్పారు.

శిథిల వంతెనలు.. ప్రజల వేదనలు

● చీమకుర్తి మండలంలో శిథిలావస్థలో బ్రిడ్జిలు
● ఏక్షణాన కూలుతాయోనని జనం ఆందోళన
● కూనంనేనివారిపాలెం బ్రిడ్జి, పుట్టచెరువుపాలెం-పిడతలపూడి మధ్య బ్రిడ్జిలకు గత ప్రభుత్వంలోనే నిధులు మంజూరు
● పనులు ప్రారంభించడంలో కూటమి ప్రభుత్వం విఫలం



మర్రిచెట్లపాలెం అయ్యప్ప రాజుపాలెం గ్రామాల మధ్య ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి



చీమకుర్తి-కూనంనేనివారిపాలెం బైపాస్ కూడలిలో ఎన్ఎస్పీ కాలువ మీద అధ్వానంగా ఉన్న బ్రిడ్జి



పుట్టచెరువుపాలెం పిడతలపూడి గ్రామాల మధ్య అధ్వాన పరిస్థితుల్లో ఉన్న బ్రిడ్జి దుస్థితి.

చీమకుర్తిరూరల్:

చీమకుర్తి మండలంలో కాలంచెల్లి శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జిలు ప్రయాణికులను కలవరపెడుతున్నాయి. మండలంలోని చీమకుర్తి-కూనంనేనివారిపాలెం బైపాస్ కూడలిలో ఎన్ఎస్పీ కాలువ మీద ఉన్న బ్రిడ్జి అధ్వానంగా ఉంది. ఈ బ్రిడ్జి మీదుగా చీమకుర్తి మండలంలోని పలు గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. బ్రిడ్జి పరిమాణం చిన్నగా ఉండటంతో తరచూ ట్రాఫిక్ జాం అవుతోంది. కూనంనేనివారి పాలెం గ్రామ పరిధిలో కొన్ని గ్రానైట్ పరిశ్రమలున్నాయి. వాటికి నిత్యం ముడి రాయి సరఫరా చేసేందుకు భారీ లారీలు, కంటైనర్లు ఈ బ్రిడ్జిపై వెళ్తుంటాయి. బ్రిడ్జి శిథిలావస్థలో ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. అదేవిధంగా పుట్టచెరువుపాలెం-పిడతలపూడి గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి, మర్రిచెట్లపాలెం-అయ్యప్పరాజుపాలెం గ్రామాల మధ్య ఉన్న రెండు బ్రిడ్జిలు కూడా శిథిలావస్థకు చేరాయి. నూతన బ్రిడ్జిలు నిర్మించాలని చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు పలుమార్లు కలెక్టర్‌కు, జెడ్పీ సీఈఓకు లిఖితపూర్వకంగా అర్జీలిచ్చారు. అయినా వాటిపై ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

గత ప్రభుత్వంలో నిధులిచ్చినా..

☛ కూనంనేనివారిపాలెం బైపాస్‌లో నూతన బ్రిడ్జి నిర్మాణానికి జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ రూ.57.72 లక్షలు మంజూరు చేశారు. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఆ పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ బ్రిడ్జి నిర్మాణం పనులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

☛ అదేవిధంగా పుట్టచెరువుపాలెం-పిడతలపూడి గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి నిర్మాణానికి మండల ప్రజాపరిషత్ నిధుల నుంచి రూ.30 లక్షలు ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు మంజూరు చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో టెక్నికల్ శాంక్షన్ అగ్రిమెంట్స్ అన్నీ కూడా అయ్యాయి. కానీ సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఆ పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాని గురించి పట్టించుకోలేదు.

అభివృద్ధి పనులు పట్టించుకోని కూటమి ప్రభుత్వం:



కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి కేవలం మాటల్లోనే తప్ప చేతల్లో లేకుండా పోయింది. కూనంనేనివారి పాలెం బైపాస్ కూడలిలో ఎన్ఎస్పీ కాలువ మీద నూతన బ్రిడ్జి నిర్మాణానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం లో నిధులు మంజూరు చేసినా ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఈ బ్రిడ్జి పనులు ముందుకు సాగడం లేదు. ఈ బ్రిడ్జి పనులు ప్రారంభమవుతాయన్న నమ్మకం కూడా ప్రజల్లో కనిపించడం లేదు. 40 ఏళ్ల క్రితం అప్పుడు ఉన్న జనాభా, ఆనాటి అవసరాన్ని బట్టి సింగిల్ లైన్ బ్రిడ్జి నిర్మించారు. ఇప్పుడు ట్రాఫిక్ బాగా పెరిగింది. ఇక్కడ రెండు లైన్ల బ్రిడ్జి నిర్మించాలి.

– పమిడి వెంకటేశ్వర్లు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, చీమకుర్తి

నిధులున్నా పనులు ప్రారంభించలేదు



కూనంనేనివారిపాలెం బైపాస్ కూడలిలో బ్రిడ్జి నిర్మాణానికి జెడ్పీ నుంచి రూ.52.72 లక్షల నిధులను జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మంజూరు చేశారు. కానీ ఇప్పటి వరకు ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఈ పరిస్థితికి కారణం కూటమి ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం. ఇకనైనా ఈ సమస్యకు పరిష్కార మార్గాన్ని చూపించి త్వరగా ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజల తరఫున కోరుతున్నాం. 9వ తేదీ జరిగే జెడ్పీ సర్వ సభ్య సమావేశంలో ఈ సమస్యపై మరొకసారి అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– వేమా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ, చీమకుర్తి.

బ్రిడ్జి నిర్మించడం ప్రజలకు చాలా అవసరం..



పుట్టచెరువు పాలెం-పిడతలపూడి గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి నిర్మాణానికి గత ప్రభుత్వంలోనే నిధులు మంజూరయ్యాయి. టెక్నికల్ శాంక్షన్ అగ్రిమెంట్లు కూడా పూర్తయినా ఎలక్షన్ నోటిఫికేషన్ రావడంతో పనులు నిలిపేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఆ కాంట్రాక్టర్ చేత అయినా లేదా వేరొకరి చేత అయినా ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు ఉపయోగకరంగా చేయాలి.

– సుంకర శ్రీనివాసరావు, పుట్ట చెరువుపాలెం

నూతన బ్రిడ్జిలు నిర్మించాలి...



మర్రిచెట్లపాలెం-అయ్యప్ప రాజుపాలెం గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జిలు ప్రమాదకర పరిస్థితిలో ఉన్నాయి. ఈ ప్రాంతంలో చాలాసార్లు వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. ఈ బ్రిడ్జిల నిర్మాణాలకు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో పలుమార్లు జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు ఉన్నతాధికారులకు దృష్టికి అంచనా విలువ కోసం అర్జీలు ఇచ్చినా ఇంత వరకు వాటికి అంచనా వేయలేదు. అధికారులు నిర్లక్ష్యమే దీనికి కారణం.

– చిన్నపురెడ్డి వెంకటరెడ్డి ఎంపీటీసీ, నిప్పట్లపాడు

వైభవంగా వెంకటేశ్వరస్వామి నగరోత్సవం



వెంకటేశ్వరస్వామి నగరోత్సవ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

చీమకుర్తి: వెంకటేశ్వరస్వామి నగరోత్సవాన్ని మంగళవారం చీమకుర్తిలో గోవిందమాల స్వాముల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. హరిహరక్షేత్రం నుంచి ప్రధాన రహదారి మీదుగా నిర్వహించిన నగరోత్సవ వేడుకల్లో భక్తులు ఎదురేగి కొబ్బరికాయలు, కర్పూరాన్ని సమర్పించారు.

వైభవంగా భావనారుషి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చీమకుర్తి: భద్రావతి సమేత భావనారుషి కల్యాణోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. చీమకుర్తిలోని భావనారుషి ఆలయంలో తిరునాళ్ల సందర్భంగా అమ్మవారు, స్వామి వారి కల్యాణ కార్యక్రమానికి స్థానిక భక్తులు హాజరయ్యారు. రెండో రోజు కార్యక్రమంలో భాగంగా వేద పండితుల సమక్షంలో కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దొంతు వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి జట్ల మురళీధర్, సలహాదారు తాటికొండ వెంకట సుబ్బారావు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

మద్దిపాడు ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా ప్రసాద్

మద్దిపాడు: మండల ఎఫ్ఏసీ ఎంపీడీవోగా డీఎస్వీ ప్రసాద్ ను నియమిస్తూ సీఈఓ కార్యాలయం నుంచి మంగళవారం మధ్యాహ్నం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న వి.జ్యోతి ఐదు నెలల పాటు శిక్షణకు వెళ్లగా ఆమె స్థానంలో ఎఫ్ఏసీ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న డీఎస్వీ ప్రసాద్ ను నియమించారు.

టెన్త్‌లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్

● జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ తమీమ్ అన్సారియా
● విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ఒంగోలు అర్బన్: పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. మంగళవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు స్థానిక కలెక్టరేట్‌లో ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పదో తరగతి ఫలితాల్లో జిల్లా విద్యార్థులు రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. స్టడీ అవర్స్ నిర్వహించడంతోపాటు పరీక్షలకు తగిన విధంగా విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వసతి గృహాల్లో ఉన్న 2,006 మంది టెన్త్ విద్యార్థులు ఉత్తీర్ణులు కావాలన్నారు. మొత్తం 115 వసతి గృహాల్లో విద్యార్థులకు రూ.260 విలువైన స్టడీ మెటీరియల్ అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అంజల, ఓఎంసీ కమిషనర్ వెంకటేశ్వరరావు, డీఈఓ కిరణ్‌కుమార్, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఖబరస్థాన్ స్థలం రద్దు చేస్తే ఉద్యమిస్తాం



ఖబరస్థాన్ స్థలం వద్ద నినాదాలిస్తున్న ఎస్‌డీపీఐ నాయకులు

ఒంగోలు టౌన్: నగర పరిధిలోని దశరాజుపల్లి రోడ్డులో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముస్లింలకు కేటాయించిన ఖబరస్థాన్ స్థలాన్ని రద్దు చేస్తే ఉద్యమిస్తామని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు ఖబరస్థాన్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాస్టర్ ప్లాన్ ప్రకారమే గత ప్రభుత్వం సర్వే నంబర్ 42లో 1.70 ఎకరాలు, సర్వే నంబర్ 43లో 0.30 సెంట్ల స్థలాన్ని కేటాయించి కౌన్సిల్లో తీర్మానం చేసిందన్నారు. కొందరు వ్యక్తులు దురుద్దేశపూర్వకంగా ముస్లింలకు ఖబరస్థాన్ స్థలం దక్కకుండా సమస్యలు సృష్టిస్తున్నారని, దానికి ఎమ్మెల్యే దామచర్ల వంత పాడటం దురదృష్టకరమన్నారు. అత్యవసరంగా కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి ఖబరస్థాన్ స్థలాన్ని రద్దు చేయాల్సిన అవసరం ఏముందో చెప్పాలని ప్రశ్నించారు. ప్రశాంతంగా ఉన్న ఒంగోలు నగరంలో కులాల మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తున్న దుష్టశక్తులకు గుణపాఠం చెప్పేందుకు ప్రజా సంఘాలన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ జోక్యం చేసుకుని కోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తంబి శ్రీనివాస రావు, ఆవాజ్ జిల్లా నాయకులు పఠాన్ కరీముల్లా ఖాన్, ఎస్‌డీ హుసేన్, షేక్ అమీర్, షేక్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు తీరని ద్రోహం : ఎస్డీపీఐ

ఎన్నో ఏళ్లు న్యాయస్థానంలో పోరాడి సాధించుకున్న ఖబరస్థాన్ స్థలాన్ని ఒక్క కలం పోటుతో రద్దు చేయడం ద్వారా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముస్లింలకు తీరని ద్రోహం చేస్తున్నారని ఎస్డీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు షేక్ అబ్దుల్ సత్తార్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఎస్డీపీఐ నాయకులు దశరాజుపల్లి వద్ద ఖబరస్థాన్ స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోతురాజు కాలువ పనులు పూర్తి చేయకుండా, మంచినీటి సమస్య పరిష్కరించకుండా ముస్లింల ఖబరస్థాన్ స్థలాన్ని రద్దు చేయడమే పనిగా పెట్టుకోవడం దామచర్ల వైఖరిని తేటతెల్లం చేస్తోందన్నారు. విజ్ఞత కలిగిన ఎమ్మెల్యే ఎవరైనా ఖబరస్థాన్ స్థలాన్ని రద్దు చేసి సొంత కులానికి పార్క్ ఏర్పాటు చేస్తారా అని ప్రశ్నించారు. ఇప్పటికే నిరుపేద ముస్లింల కోసం నిర్మించిన షాదీఖానాను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే కుట్రలు పన్నారని, మరోవైపు ముస్లింల ఖబరస్థాన్ స్థలాన్ని రద్దు చేసేందుకు కుతంత్రాలు చేస్తున్నారని మండిపడ్డారు. ముస్లింలు, కమ్మ కులస్తులకు మధ్య విభేదాలు సృష్టించవద్దని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పఠాన్ ఖాజా వలి, అజీమ్ బాషా, షఫీ పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు



సూర్యప్రభ వాహనంపై చెన్నకేశవస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



వెంకటేశ్వర స్వామిని ఊరేగిస్తున్న భక్తులు



రథసప్తమి పూజలు చేస్తున్న అర్చకులు

సంతనూతలపాడు: మండల కేంద్రంలోని శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఘనంగా రథసప్తమి వేడుకలు, స్వామి వార్లకు ఆలయం చుట్టూ ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలచే నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు పీ అజయ్ బాబు వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో రథసప్తమి వేడుకల్లో పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో వేణుగోపాల స్వామి, ఆళ్వారాజుల స్వామి దేవస్థానంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రథసప్తమి సందర్భంగా పూజారి దీవి శ్రీధర్ బాబు విశేష పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం రథ సప్తమి విశిష్టతను వివరించారు. కార్యక్రమానికి ఉభయదాతలుగా గ్రామ సర్పంచ్ దేవరకొండ జయమ్మ, వెంకటేశ్వర్లు దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మున్నంగి వెంకటరావు, మాదాసు రాంబాబు, కాట్రగడ్డ చంద్రబాబు అమరా వెంకటేశ్వర్లు, ఆత్మకూరి వాసు తదితరులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఒంగోలు మెట్రో: రథ సప్తమి వేడుకలను మంగళవారం ఒంగోలు నగరంలో వైభవంగా నిర్వహించారు. కొండమీద శ్రీగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానం, స్థానిక గాంధీ రోడ్డు దక్షిణం బజారు వెంకటేశ్వర స్వామి ఆలయం, కేశవస్వామి పేటలోని ప్రసన్న చెన్నకేశవస్వామి ఆలయాల్లో స్వామివారి ఉత్సవమూర్తులను సప్త వాహనాలపై ఊరేగించారు. శ్రీగిరి దేవస్థానంలో ఆదిత్య హోమం నిర్వహించారు.

క్యాన్సర్ ను ముందుగానే గుర్తిద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బందితో డాక్టర్ ఆనంద్ మోహన్ తదితరులు

మద్దిపాడు: క్యాన్సర్ ను ముందుగానే గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకుందామని పీహెచ్‌సీ డాక్టర్ ఆనంద్ మోహన్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఆయన సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ పై విజయం సాధించడానికి క్యాన్సర్ సోకిన వారిని గుర్తించాలని సిబ్బందికి తెలిపారు. 15 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి స్క్రీనింగ్ నిర్వహించాలన్నారు. ముందస్తుగా క్యాన్సర్ ను కనుగొనడానికి స్క్రీనింగ్ చేయించుకోవాలని అన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్ హెచ్ పీలతో పీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన వెంట సీహెచ్ఓ రజిత కుమారి, పలువురు ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి




మాట్లాడుతున్న ఎంపీడీవో

సంతనూతలపాడు: గ్రామాల అభ్యున్నతికి సర్పంచ్‌లు, కార్యదర్శులు ఐక్యంగా పాటుపడాలని సంతనూతలపాడు ఎంపీడీవో డీ సురేష్ బాబు కోరారు. సంతనూతలపాడులో మంగళవారం ఎంపీపీ బుడంగుంట విజయ అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సర్పంచ్‌లతో ఎంపీడీవో సురేష్ బాబు సమీక్షించాలన్నారు. మండలంలో బోర్ల రిపేర్లకు రూ.6 లక్షలు కేటాయించినట్లు ఎంపీడీవో తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి వివిధ శాఖ అధికారులు ప్రోటోకాల్ పాటించాలని జెడ్పీటీసీ దుంపా రమణమ్మ సూచించారు. సంతనూతలపాడులో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని చెప్పారు. గ్రామాల్లో కార్యక్రమాలకు సర్పంచ్‌లను, ఎంపీటీసీలను అధికారులు తప్పక ఆహ్వానించాలని ఎంపీపీ విజయ సూచించారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లను, ఎంపీటీసీలను, రెవెన్యూ శాఖ వారు ఆహ్వానించకపోవడంపై పలువురు సమావేశంలో వైస్ ఎంపీపీలు తన్నీరు రాగమ్మ, మండవ సులోచన, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

కార్మికులు ఈ-శ్రమ్‌లో నమోదు కావాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



ఈ-శ్రమ్ పోర్టల్‌పై సమీక్షిస్తున్న కలెక్టర్

ఒంగోలు అర్బన్: అసంఘటిత రంగ కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో సభ్యత్వం నమోదు చేసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. మంగళవారం ప్రకాశం భవనంలో ఈ-శ్రమ్ పథకంపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ..పోర్టల్‌లో నమోదైన కార్మికులకు అంగవైకల్యం కలిగినా లేదా ప్రమాదవశాత్తు మరణించినా ఆర్థిక భద్రత ఉంటుందన్న విషయంపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. సీఎస్సీ లేదా సచివాలయాల్లో సభ్యత్వ నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని చెప్పారు.

☛ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. తనిఖీల వివరాలను ఉప కార్మిక కమిషనర్ గాయత్రి వివరించారు. ఆయా సమావేశాల్లో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

8న న్యాయ కళాశాలలో వ్యాసరచన పోటీలు

ఒంగోలు: ఈనెల 8న ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నటరాజ్ కుమార్, పాలకవర్గ సభ్యులు బత్తిని మహేష్ తెలిపారు. మంగళవారం స్థానిక పెళ్లూరు సమీపంలోని ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాలలో వారు విలేకరుల సమావేశంలో వ్యాసరచన పోటీలకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఇంటర్ విద్యార్థులకు 'భారత రాజ్యాంగం'పర్యావరణ పరిరక్షణ' అనే అంశంపై, డిగ్రీ విద్యార్థులకు 'రాజ్యాంగం ప్రాథమిక హక్కులు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్నవారు 8వ తేదీన కాలేజీకి హాజరుకావాలని సూచించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

సంతనూతలపాడు: ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంకు సౌజన్యంతో మండలంలోని గంగవరంలో కళాజాత నిర్వహించారు. సామాన్య ప్రజలకు బ్యాంకింగ్ పథకాలు, సామాజిక భద్రతా పథకాలు, డిజిటల్ బ్యాంకింగ్, ప్రైవేటు ఆర్థిక సంస్థల మోసాలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలు, రిజర్వ్ బ్యాంక్ అంబుడ్స్‌మన్‌పై అవగాహన కల్పించారు. వివిధ ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రేన్స్‌ఫర్మేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాస్, కౌన్సిలర్స్ ఏ చిన్న రాజా, ఎస్ అమృత రాజు, కళాజాత బృందం పాల్గొన్నారు.